పోక్సో కేసులో బండి భగీరథ్‌కు బెయిల్

విశ్వంభర, హైదరాబాద్ : కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కు ఊరట లభించింది. పోక్సో కేసులో అతడికి తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. షరతులతో కూడిన బెయిల్ ఇచ్చిన ఉన్నత న్యాయస్థానం.. దర్యాప్తునకు సహకరించాలని బండి భగీరథ్‌ను ఆదేశించింది. హైదరాబాద్‌లోని పేట్‌బషీరాబాద్ పీఎస్‌లో అతడిపై పోక్సో కేసు నమోదైంది. మే 16న పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.
బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై ఇటీవల వాదనలు ముగియడంతో తీర్పును హైకోర్టు వాయిదా వేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ భగీరథ్ విద్యార్థి అని, 45 రోజులకుపైగా జైలులో ఉండటంతో జీవితంలో చాలా కోల్పోయాదన్నారు. పరస్పర అంగీకారంతో జరిగిన దానిపై కేసులు నమోదు చేయడం చెల్లదని.. ఇదే విషయాన్ని హైకోర్టు, సుప్రీంకోర్టులు పలు తీర్పుల్లో వెల్లడించాయన్నారు. బెయిల్ మంజూరు చేస్తే కోర్టు విధించిన షరతులకు కట్టుబడి ఉంటారన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర రావు వాదనలు వినిపిస్తూ.. మే 8న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వెంటనే వాంగ్మూలాల సేకరణ మొదలైందన్నారు. దర్యాప్తు దాదాపు పూర్తికావచ్చిందని, గడువులోగా అభియోగ పత్రాన్ని దాఖలు చేస్తామన్నారు. ఈ దశలో బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేస్తారన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన తీర్పును నేటికి వాయిదా వేశారు. తాజాగా భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

అన్ని ఘర్షణలు దౌత్యం, చర్చలు ద్వారానే పరిష్కారం

మరోసారి పశ్చిమాసియాలో టెన్షన్.. స్పందించిన ప్రధాని మోడీ

విశ్వంభర, నేషనల్ బ్యూరో : పశ్చిమాసియా మరోసారి దద్దరిల్లుతోంది. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్న ప్రధాని నరేంద్రమోడీ తాజా పరిస్థితులపై మెల్‌బోర్న్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న అన్ని ఘర్షణలు దౌత్యం, చర్చలు ద్వారానే పరిష్కారం సాధ్యమవుతాయని పేర్కొన్నారు.మూడుదేశాల పర్యటనలో భాగంగా ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్న మోడీ.. ఆ దేశ ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్‌తో కలిసి ఇండియాఆస్ట్రేలియా సీఈఓ ఫోరమ్‌లో ప్రసంగించారు. వాణిజ్యం, రక్షణ, విద్య సహా పలు అంశాలపై ఆల్బనీస్‌తో చర్చించారు. అలాగే స్వచ్ఛ ఇంధనాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో కీలకమైన అణుశక్తి ఒప్పందం పై సంతకాలు చేశారు. భారత్‌కు ఆస్ట్రేలియా యురేనియం సరఫరా చేస్తుందని మోడీ వెల్లడించారు. క్రిటికల్ మినరల్ కారిడార్, డిఫెన్స్ ఇన్నోవేషన్ కారిడార్ ఏర్పాటుకు ప్రణాళికలను ప్రకటించారు. ఇండోపసిఫిక్‌లో శాంతి, సుస్థిరత, స్వేచ్ఛా నౌకాయానంపై కలిసి అడుగులు వేస్తామని తెలిపారు. తాజా పర్యటన ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్రికెట్ పోలిక తెచ్చిన మోడీ..

భారత్, ఆస్ట్రేలియా ప్రజలకు ఎంతో ఇష్టమైన ఆట క్రికెట్ . అందుకే ఈ రెండు దేశాల మధ్య చర్చలు జరిగినప్పుడల్లా క్రికెట్ ప్రస్తావన వస్తూనే ఉంటుంది. తాజాగా కుదిరిన యురేనియం డీల్ నేపథ్యంలో ఆ భాషలోనే మన ప్రధాని మాట్లాడారు. ''ప్రపంచ క్రీడా రాజధాని అయిన మెల్‌బోర్న్‌లో మనం ఈ రోజు ఉన్నాం. ఇక్కడ ఆ క్రీడల గురించి మాట్లాడకపోవడం అంటే.. టాస్ వేసిన తర్వాత కూడా క్రికెట్ మ్యాచ్ ప్రారంభం కాకపోవడమే అవుతుంది. ఈ రెండు దేశాల సంబంధాలకు ఇదొక ప్రత్యేక దౌత్యపరమైన భాష. మన సమావేశాలు క్రికెట్ మ్యాచ్‌ల్లానే ఉంటాయి. అజెండా వన్డే మ్యాచ్‌లా, నిర్ణయాలు టీ20 అంత వేగంగా, భాగస్వామ్యం టెస్ట్ మ్యాచ్ అంత సుదీర్ఘంగా, గాఢంగా ఉంటుంది'' అని మోడీ తెలిపిన వర్ణనకు ఆడియన్స్ చప్పట్లతో స్పందించారు. యురేనియం డీల్ కుదిరిన నేపథ్యంలో ఆయన ఈ విధంగా మాట్లాడారు.

హైదరాబాద్‌లో 'ఒలింపిక్స్' నా డ్రీమ్

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: ఆటల కోసం తెలంగాణ ప్రభుత్వం ముందడుగు వేసిందన్న సీఎం రేవంత్ రెడ్డి మహాత్మ గాంధీ నుంచి యంగ్ ఇండియా స్ఫూర్తి పొందామని తెలిపారు. మహాత్మాగాంధీ యంగ్ ఇండియా అనే వార్తా పత్రికను నడిపేవారని గుర్తు చేశారు. పీటీ ఉషతో కలిసి యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ వర్సిటీని సీఎం ప్రారంభించారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌లో జరిగిన ఈ వేడుకలో స్పోర్ట్స్ వర్సిటీ వెబ్‌సైట్, లోగోను పీటీ ఉషతో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. 8వ ఖేలో ఇండియన్ గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రభుత్వ విధానాలే స్పోర్ట్స్‌లో దేశ దుస్థితికి కారణమని, అందుకే క్రీడాకారులను సరైన దిశలో నడిపించడానికి స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. 19902004 మధ్య హైదరాబాద్ చాలా స్పోర్ట్స్ ఈవెంట్స్‌కు ఆతిథ్యం ఇచ్చిందని, గత 20 ఏళ్లలో తెలంగాణలో ఎలాంటి పెద్ద స్పోర్ట్స్ ఈవెంట్స్ పెట్టలేదని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. హైదరాబాద్ ఒలింపిక్స్ క్రీడలు నిర్వహించాలనేది తమ డ్రీమ్ అని, 2034లో భారత్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వనుందని, దానికి హైదరాబాద్ వేదిక కావాలని కోరుకుంటున్నానని వెల్లడించారు.

దేశానికి సరైన గుర్తింపు రావట్లేదు..

ఒలింపిక్స్ పతకాల్లో భారత్ ఎప్పుడూ చివరనే ఉంటుందన్న సీఎం కొంతమంది ఒలింపిక్స్, ఇతర గేమ్స్‌లో రాణించినా దేశానికి సరైన గుర్తింపు రావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాలే స్పోర్ట్స్‌లో దేశ దుస్థితికి కారణమని విమర్శించారు. క్రీడాకారులను సరైన దిశలో నడిపించడానికే స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేశామని, క్రీడలను ప్రోత్సహించడానికే స్పోర్ట్స్ పాలసీ తీసుకువచ్చామని పేర్కొన్నారు.పీటీ ఉష మనందరికి స్ఫూర్తి అని, పీటీ ఉష ఆటల్లో, రాజకీయాల్లో, కెరియర్‌లో అందరికీ స్ఫూర్తి అని రేవంత్ రెడ్డి తెలిపారు. 2018 ఓటమి తర్వాత రేవంత్ రెడ్డి పనైపోయిందని అన్నారని, కానీ లోక్‌సభ ఎన్నికల్లో అతి పెద్ద నియోజకవర్గం నుంచి గెలిచానని, తర్వాత పార్టీ అధ్యక్షుడిని, సీఎం అయ్యానని గుర్తు చేశారు. నవంబర్‌లో ఖేలో ఇండియా గేమ్స్‌కు ఆతిథ్యం ఇస్తున్నామని, చదువుకుంటే ఉద్యోగం వస్తుందో లేదో తెలియదని, ఆటలు ఆడితే మాత్రం కచ్చితంగా ఉద్యోగం వస్తుందని పేర్కొన్నారు. ప్రతిభను వెలికితీయడానికి ఉపయోగపడుతుంది.. స్పోర్ట్స్ వర్సిటీ ప్రారంభోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందని పీటీ ఉష తెలిపారు. స్పోర్ట్స్ వర్సిటీ యువ ఆటగాళ్ల ప్రతిభను వెలికితీయడానికి ఉపయోగపడుతుందని అన్నారు. స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. పెద్ద కల కనండి, కష్టపడండి, సాధించండని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగస్వాములు కావాలి

విశ్వంభర, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలనే సంకల్పంతో ప్రజాప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో స్టీల్ , సిమెంట్ పరిశ్రమలు భాగస్వాములు కావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ,రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు.గురువారం సచివాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్టీల్, సిమెంట్ తదితర నిర్మాణ సామగ్రి ధరలు, సరఫరా, పరిశ్రమల సహకారం అంశాలపై ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ...తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాదని, పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం, సామాజిక భద్రత, ఆత్మగౌరవాన్ని కల్పించే మహాయజ్ఞమని అన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా (హైదరాబాద్ మినహా) మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిలో ఇప్పటికే గణనీయ సంఖ్యలో 85 శాతం ఇళ్ల శ్లాబులు పూర్తయ్యాయని, మిగిలిన 15 శాతం ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. రెండో విడతలో నియోజకవర్గానికి రెండు వేల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లు మంజూరు , అలాగే క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని కార్యాచరణ చేపట్టిందన్నారు. గిరిజన నియోజకవర్గాల్లో అదనంగా వెయ్యి నుంచి 1500 ఇళ్లు మంజూరు చేస్తున్నాం. ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ. మూడు, నాలుగవ విడతల్లో కూడా ఇళ్లను మంజూరు చేస్తాం. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా 100 శాతం సబ్సిడీతో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తూ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టడం లేదని, ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు.ప్రభుత్వంపై ఎంతటి ఆర్థిక భారం పడినా పేదల ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రతి లబ్ధిదారుడికి నిర్మాణ పురోగతికి అనుగుణంగా విడతల వారీగా ప్రతి సోమవారం పారదర్శకంగా నిధులను విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రతి పేద కుటుంబం సొంత ఇంటిలో నివసించే వరకు ప్రభుత్వం తన బాధ్యతను పూర్తి నిబద్ధతతో నిర్వర్తిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ బృహత్తరమైన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో స్టీల్, సిమెంట్ పరిశ్రమల యాజమాన్యాలు కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లకు అవసరమైన స్టీల్, సిమెంట్‌ను తక్కువ ధరకే అందించాలని మంత్రులు చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం-పరిశ్రమలు-ప్రజలు కలిసి పనిచేస్తే తెలంగాణలో గుడిసెలు లేని రాష్ట్రం లక్ష్యాన్ని త్వరితగతిన సాధించవచ్చని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఒక ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ప్రతి వర్గం సహకారం అందించాలని మంత్రులు పిలుపునిచ్చారు. పేదవాడికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయమందిస్తే ప్రభుత్వంతో పాటు పరిశ్రమల యాజమాన్యాలను కూడా చిరస్థాయిగా గుర్తుపెట్టుకుంటారని అన్నారు.
పరిశ్రమలు, హౌసింగ్ అధికారులు ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో సమన్వయం చేసుకొని లబ్దిదారునికి ఏవిధంగా మెటీరియల్ చేరవేయాలన్న దానిపై రూట్ మ్యాప్ తయారు చేయాలని మంత్రులు సూచించారు. ఈ సమావేశంలో పరిశ్రమల యాజమాన్యాలతోపాటు హౌసింగ్ సెక్రటరీ వి.పి.గౌతమ్, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణాదిత్య, టీజీఐఐసీ ఎండీ శశాంక తదితరులు పాల్గొన్నారు.

తాడిచర్ల-2 బొగ్గు గని.. తెలంగాణకు భరోసా

విశ్వంభర, హైదరాబాద్ : తెలంగాణ బిడ్డగా తాడిచర్ల2 బొగ్గు గని కోసం తాను కృషి చేస్తే అభినందించాల్సింది పోయి విమర్శలు చేస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆ విమర్శలను సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞతకే వదిలేస్తున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో సింగరేణి కార్మికులకు రూ.30వేల కోట్ల బకాయిలు పెట్టారని.. ఆ పార్టీకి తనను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. ''రాష్ట్రానికి బొగ్గు బ్లాక్ తేవడం తప్పా ?బీఆర్ఎస్ హయాంలో రెండు కోల్ బ్లాక్స్‌ను ప్రైవేటు వాళ్లకు అప్పగించారు. బొగ్గు గని వేలం పాటను మోడీ తీసుకురాలేదు.. సుప్రీంకోర్టు తెచ్చింది. సింగరేణికి తాడిచర్ల2 బ్లాక్‌ను కేంద్రం కేటాయించింది. ఇటీవల కాలంలో సింగరేణి బొగ్గులో నాణ్యతా లోపముంది. మంచి గనులు లేకపోవడం వల్ల నాణ్యమైన బొగ్గు లభించడం లేదు. సింగరేణికి చేయూత అందించాలని మోడీని అనేకసార్లు కలిసి కోరాను. సింగరేణికి 45 ఏళ్లపాటు తాడిచర్ల2 అందుబాటులో ఉంటుంది. ఇది తెలంగాణకు భరోసా. అత్యంత నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి కానుంది. భవిష్యత్తులో విద్యుత్ సమస్యలు రాకూడదని ఈ గని కేటాయించారు. రాజకీయాలకు అతీతంగా సింగరేణి కార్మికులకు అండగా ఉండాలి'' అని కిషన్‌రెడ్డి అన్నారు.

అయోధ్య కేసులో అసలు సూత్రధారి అవినాష్ శుక్లా

విశ్వంభర, అయోధ్య : దేశాన్ని కుదిపేసిన అయోధ్య రామ మందిర విరాళాల చోరీ కేసులో అవినాష్ శుక్లా కీలక నిందితుడని ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ గుర్తించింది. ఆలయానికి భక్తులు సమర్పించిన నగదు విరాళాలను లెక్కించేందుకు ట్రస్ట్ శుక్లాను రూ.15 వేల వేతనంతో నియమించింది. 70 సార్లు నగదును దారి మళ్లించిన వ్యవహారంలో అతని పాత్ర కీలకమని సిట్ ప్రాథమికంగా కనుగొన్నట్లు విశ్వసనీయవర్గాలు పేర్కొన్నాయి. ఈ వ్యవహారం మొత్తం శుక్లా చుట్టూ అల్లుకుందని.. ఇది మరో ఐదుగురు నిందితులను గుర్తించేందుకు..విరాళాల లెక్కింపు కేంద్రంలో అక్రమాలు జరిగిన తీరుతెన్నులను గుర్తించేందుకు ఉపయోగపడిందని సిట్ వర్గాలు పేర్కొన్నాయి. నిందితులుగా గుర్తించిన అనుకల్ప్ మిశ్ర, లవ్‌కుష్ మిశ్ర, కరుణేష్ పాండేలు కూడా శుక్లాకు సహకరించినట్లు సీసీ ఫుటేజ్‌లో కనిపించిందని ఆ వర్గాలు తెలిపాయి. దర్యాప్తులో భాగంగా పోలీసులు మొదట శుక్లాను అదుపులోకి తీసుకుని విచారించగా ఆయన ఇంట్లో విరాళాల హుండీ కనిపించింది. ఆయన స్వస్థలంలోనూ పోలీసులు ఆస్తుల వివరాలు సేకరిస్తున్నారు. విరాళాల చోరీ కేసులో నిందితులైన అనుకల్ప్ మిశ్ర, లవకుష్ మిశ్ర, కరుణేష్ పాండేలను బుధవారం పోలీసులు తమ కస్టడీలోకి తీసుకున్నారు.

ఫోర్జరీ రశీదులతో విరాళాలు..

భక్తుల నుంచి విరాళాలను సేకరించేందుకు ఫోర్జరీ చేసిన రశీదులను వాడినట్లు అనుకల్ప్ మిశ్ర, లవ్‌కుష్ మిశ్ర, కరుణేష్ పాండేలు పోలీసు విచారణలో అంగీకరించారు. తాము మరో నిందితుడు టిన్నూ యాదవ్‌తో కలిసి ఫోర్జరీ రశీదులతో విరాళాలు సేకరించినట్లు చెప్పారు. పోలీసులు ఒక పాత నకిలీ రశీదు పుస్తకాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు.

80.9 శాతానికి పెరిగిన భారతదేశ అక్షరాస్యత రేటు

విశ్వంభర, నేషనల్ బ్యూరో : దేశవ్యాప్తంగా విద్యా ప్రమాణాలు, అక్షరాస్యతను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న వివిధ రకాల విద్యా సంస్కరణలు సత్ఫలితాలనిస్తున్నాయి. నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ నిర్వహించిన తాజా 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' వార్షిక నివేదిక ప్రకారం.. భారతదేశ సగటు అక్షరాస్యత రేటు గణనీయంగా మెరుగై 80.9 శాతానికి చేరుకుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉన్న 74 శాతం అక్షరాస్యతతో పోలిస్తే.. దేశంలో విద్యావ్యాప్తి ఎంతో వృద్ధి చెందిందని కేంద్ర విద్యా శాఖ వెల్లడించింది. అయితే, ఈ నివేదికలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఇప్పటికీ వ్యత్యాసాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో అక్షరాస్యత రేటు అత్యధికంగా 90 శాతంగా నమోదు కాగా, గ్రామీణ ప్రాంతాల్లో ఇది కేవలం 77 శాతంగానే నమోదైంది. రాష్ట్రాల వారీగా అక్షరాస్యత గణాంకాలను పరిశీలిస్తే.. ఈశాన్య రాష్ట్రమైన మిజోరాం 98.2 శాతం అక్షరాస్యతతో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచి సరికొత్త రికార్డు సృష్టించింది. ఆ తర్వాతి స్థానాల్లో కేంద్రపాలిత ప్రాంతమైన లక్షద్వీప్ (97.3%), నాగాలాండ్ (95.7%), కేరళ (95.3%) నిలిచాయి. కాగా, దేశంలోనే అత్యంత తక్కువ అక్షరాస్యత రేటుతో ఆంధ్ర ప్రదేశ్ (72.6%) చివరి స్థానంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది. ఏపీ తర్వాత స్థానాల్లో బీహార్ (74.3%), మధ్యప్రదేశ్ (75.2%), రాజస్థాన్ (75.8%) ఉన్నాయి. ఇక తెలంగాణ రాష్ట్రం 76.9 శాతం అక్షరాస్యతను నమోదు చేసింది.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

విశ్వంభర, సంగారెడ్డి : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన, ఆధునిక వైద్య సేవలను ఉచితంగా అందించడంతో పాటు పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు సత్వర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ఈఎస్ఐ వైద్య సేవలను విస్తరిస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. గురువారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈఎస్ఐ డిస్పెన్సరీని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్, జగ్గారెడ్డి లతో కలిసి మంత్రులు ప్రారంభించారు.ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా అన్ని మౌలిక వసతులు, వైద్య సదుపాయాలను కల్పిస్తూ ఈఎస్ఐ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు.
సంగారెడ్డి పారిశ్రామిక ప్రాంతంలో పనిచేసే కార్మికులు వైద్య చికిత్స కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే అన్ని రకాల వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో సంగారెడ్డిలో ఈఎస్ఐ డిస్పెన్సరీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.రాష్ట్రంలో సుమారు 80 లక్షల కుటుంబాలు ఈఎస్ఐ వైద్య సేవలపై ఆధారపడుతున్నాయని, ఈఎస్ఐ ఆసుపత్రులు, డిస్పెన్సరీల్లో అవసరమైన అన్ని సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు.ఇటీవల ఆర్‌సీ పురం ఈఎస్ఐ ఆసుపత్రిని సందర్శించిన సందర్భంగా కొన్ని ప్రత్యేక వైద్య సేవలు లేకపోవడంతో రోగులు సనత్‌నగర్‌కు వెళ్తున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. వచ్చే ఆరు నెలల్లో అక్కడ అన్ని ప్రత్యేక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి, కార్మికులు స్థానికంగానే పూర్తి స్థాయి చికిత్స పొందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.త్వరలో ఆర్‌సీ పురం ఈఎస్ఐ ఆసుపత్రిలో 20 పడకల డయాలసిస్ యూనిట్‌ను ఏర్పాటు చేయడంతో పాటు వచ్చే ఏడాదిలో కార్డియాలజి సెంటర్‌ను కూడా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లా పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటికే ఏడు ఈఎస్ఐ డిస్పెన్సరీలు ఉండగా, సంగారెడ్డిలో ఎనిమిదో డిస్పెన్సరీని ప్రారంభించడం సంతోషకరమన్నారు.రూ.200 కోట్లతో సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. జహీరాబాద్, నారాయణఖేడ్, సదాశివపేట, ఆందోల్, జోగిపేట ప్రాంతాల ప్రజలకు కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, ఈఎన్‌టీ, క్యాన్సర్ చికిత్స, ట్రామా కేర్, నేత్ర వైద్య సేవలు వంటి సూపర్ స్పెషాలిటీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పీజీ సీట్లను కూడా కేటాయించినట్లు వెల్లడించారు.రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని 104 ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకల సంఖ్యను పెంచుతూ వైద్య సేవలను మరింత విస్తరిస్తున్నామని తెలిపారు. ప్రజలకు అన్ని రకాల ఆధునిక వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని నిర్మలా జగ్గారెడ్డి అడిగిన వెంటనే మంజూరు చేసిన మంత్రి వివేక్ వెంకట స్వామి కి, సహకరించిన మంత్రి దామోదర రాజనర్సింహ కు జగ్గారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ డిస్పెన్సరి అందుబాటులోకి రావడం తో సంగారెడ్డి ప్రాంత కార్మికులకు లాభం జరుగుతుందని సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఈఎస్ఐ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. గౌతమ్ , సంగారెడ్డి, సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌లు వనిత సంతోష్, అంజమ్మ సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్,, వైద్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శ వైద్య సంస్థగా బీబీనగర్ ఎయిమ్స్



విశ్వంభర, తెలంగాణ బ్యూరో : బీబీనగర్ ఎయిమ్స్ ను దక్షిణ భారతదేశానికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గా మారుస్తామని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా తెలిపారు. మెడికల్ ఎడ్యుకేషన్, పేషెంట్ కేర్, రీసర్చ్ రంగాల్లో బీబీనగర్ ఎయిమ్స్ తన ప్రత్యేకతను చాటుకోనుందని ఆయన పేర్కొన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని బీబీ నగర్ ఎయిమ్స్ ను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. ఎయిమ్స్ పనులను వేగవంతం చేసి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు గాను ఆయన వైద్యులు, నిర్మాణ పనులు చేపట్టిన ఎన్సీసీ ప్రతినిధులతో మాట్లాడారు. పనులు వేగం పెంచేందుకు ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. అనంతరం హాస్పిటల్, మెడికల్ కాలేజీ, ఇతర భవనాలను బ్యాటరీ కారులో తిరిగి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు 87 శాతం పనులు పూర్తయ్యాయని... ఈ ఏడాది చివరి నాటికి ఎయిమ్స్ పనులన్నీ పూర్తి అవుతాయని తెలిపారు. అప్పటి వరకు ప్రతి వారం ఈ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

తమ హయాంలోనే ఎక్కువ ఎయిమ్స్..

ప్రధానమంత్రి మోడీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఆరోగ్య, మౌలిక వసతులను విస్తృతంగా అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర మంత్రి అన్నారు. గతంలో దేశంలో ఢిల్లీలో మాత్రమే ఎయిమ్స్ మాత్రమే ఉండేదని, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి హయాంలో ఐదు కొత్త ఎయిమ్స్ ఏర్పాటు చేశామన్నారు. యూపీఏ హయాంలో 2004 నుంచి 2014 వరకు కేవలం రాయ్ బరేలీలో మాత్రమే ఒక్క ఎయిమ్స్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. 2014 తర్వాత ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక మరో 19 ఎయిమ్స్ కు ఆమోదం లభించగా వాటిలో 14 ఇప్పటికే పూర్తయ్యాయని, మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయని వివరించారు. దీంతో ఇప్పుడు దేశంలో ఎయిమ్స్ సంఖ్య మొత్తం 26కు చేరుకున్నట్లు వెల్లడించారు. బీబీనగర్ ఎయిమ్స్ నిర్మాణానికి సుమారు రూ.1,000 కోట్లు వెచ్చిస్తున్నామని... ఇక్కడ పరిశోధన కోసం రూ.64 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.ఆస్పత్రిలో 24 వైద్య విభాగాలు పనిచేస్తుండగా, ఇప్పటికే రెండు ఎంబీబీఎస్ బ్యాచ్ లు పూర్తయ్యాయని అన్నారు. నిత్యం సుమారు 1800 మంది ఔట్ పేషెంట్లకు వైద్య సేవలు అందుతున్నాయన్నారు. అత్యవసర చికిత్సలు, డయోగ్నోస్టిక్ టెస్టులు, టెలీ మెడిసిన్ సేవలు బాగా అందుతున్నాయన్నారు. డిజిటల్ కన్సల్టేషన్ (ఈసంజీవని) ద్వారా లక్షలాది మంది రోగులు సేవలు పొందారని తెలిపారు. ఇక్కడ 132 మంది అధ్యాపకులు, 133 మంది సీనియర్ రెసిడెంట్లు పని చేస్తున్నట్లు వివరించారు. ఎండీ, డీఎం(ఎంసీహెచ్) పీజీ కోర్సులున్నాయన్నారు. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలకు ఈ హాస్పిటల్ ను కేరాఫ్ అడ్రస్ గా మారుస్తామన్నారు. 129 ప్రాజెక్టులకు సంబంధించి పరిశోధన జరుగుతోందని... ఇక్కడి ఫ్యాకల్టీ 156 పరిశోధన పత్రాలను ప్రచురించినట్లు తెలిపారు.

దేశంలోనే మొట్టమొదటి కమ్యూనిటీ రేడియో స్టేషన్..

దేశంలోనే మొట్టమొదటి కమ్యూనిటీ రేడియో స్టేషన్ బీబీ నగర్ ఎయిమ్స్ లోనే ప్రారంభమైందని నడ్డా వివరించారు. ఇందులో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, వ్యాధి నివారణ చర్యలు, నిపుణులైన డాక్టర్ల సూచనలు ప్రసారం చేస్తారని తెలిపారు. ముఖ్యంగా డయల్ ఏ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలు నేరుగా రేడియోకి ఫోన్ చేసి డాక్టర్లతో మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. అలాగే ఎయిమ్స్ నుంచి 6 గ్రామాలను దత్తత తీసుకున్నారని... ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు 547 ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారని... సుమారు 66 వేల మందికి పైగా గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందాయన్నారు. పూర్తి స్థాయిలో బోధనా సిబ్బంది, ఆధునిక వైద్య సదుపాయాలతో బీబీనగర్ ఎయిమ్స్ కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ప్రజలకు అందిస్తోందని, రానున్న రోజుల్లో దేశానికే ఆదర్శ వైద్య సంస్థగా నిలుస్తుందని నడ్డా ఆశాభావం వ్యక్తం చేశారు. 2032 నాటికి బీబీనగర్ ఎయిమ్స్ అన్ని రకాల అత్యాధునిక సేవలు అందించే స్థాయికి చేరుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ఎంపీలు లక్ష్మణ్, డీకే అరుణ, చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, ఎయిమ్స్ అధికారులు పాల్గొన్నారు.

సింగరేణిలో మెడికల్ బోర్డు ఏర్పాటుచేయాలి: కవిత

విశ్వంభర, కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ఏరియాలోని పీవీకే5 భూగర్భగనిని సందర్శించారు. గని ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. 'సింగరేణిలో మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 20 నుంచి గోదావరిఖనిలో నిరాహార దీక్ష చేపడతాం. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలి. కార్మికుల పట్ల చిత్తశుద్ధి ఉంటే కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాష్ట్ర శాసన సభలో నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా తీర్మానం చేయించాలి. కార్మికులకు హెచ్ఎంఎస్ ఎప్పుడూ అండగా ఉంటుంది. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాల్సి ఉండగా.. నామమాత్రపు జీతాలు ఇస్తున్నారు'' అని కవిత మండిపడ్డారు.